బస్టాండ్‌లో ఉంటున్న నర్సయ్య కుటుంబ సభ్యులు

బతుకు దుర్భరం.. బస్టాండే నిలయం

- కులవృత్తి దూరమవడంతో కడు దయనీయం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

చందుర్తి, జనవరి 10: కమ్మరి కొలిమిలో దుమ్ముపేరును.. పెద్ద బాడిస మొద్దువారెను.. అని సినీకవి వర్ణించినట్లుగా.. కులవృత్తి కనుమరుగు కావడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. కనీసం నిల్వ నీడ లేకపోవడంతో బస్టాండే వారికి నిలయమైంది. దాతలు సాయం చేసి ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటున్నది. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలం మూడపెల్లి గ్రామానికి చెందిన కమ్మరి నర్సయ్య చిన్నతనం నుంచే కులవృత్తిని (కమ్మరి) జీవనాధారంగా భావించాడు. భార్య లచ్చవ్వ, కూతుళ్లు ఇల్లిల్లు తిరుగుతూ పని చేసేవారు. వారు ఉన్నంతలో సంతోషంగా బతికారు. సొంత ఇల్లు ఉండగా, కులవృత్తితో పలువురికి ఉపాధి కల్పించాడు. కాలక్రమేనా రైతులు, కూలీలు రెడీమేడ్ వస్తువులకే ప్రాధాన్యం ఇవ్వడంతో కమ్మరి కొలిమి మూగబోయి ఉపాధి కరువైంది. దీంతో భార్య, ఇద్దరు కూతుళ్ల పోషణ కష్టతరం కావడంతో ఉన్న ఇంటిని విక్రయించాడు. వచ్చిన అరకొర డబ్బు పది మాసాలకి ఖర్చయిపోయింది. ఈ క్రమంలో పెద్ద కూతురుకు గ్రామస్తులే చందాలు వేసి వివాహం జరిపించారు. మరో కూతురు పెళ్లి చేయలేని పరిస్థితి. ఈ క్రమంలో నిల్వ నీడ లేకపోవడంతో బస్టాండ్‌లోనే తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. అలాగే సాయం చేయాల్సిన దాతలు 998929 9845 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా నగదు పంపించాలని కోరారు.

కిడ్నాప్ కథ సుఖాంతం

- తల్లి ఒడికి చేరిన చిన్నారి
- ఏడు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్‌మహాజన్

చిన్నారితో ఎస్పీ అఖిల్‌మహాజన్

రాజన్న సిరిసిల్ల, జనవరి 10 (నమస్తే తెలంగాణ): వేములవాడ రాజన్న ఆలయంలో చిన్నారి ఆద్విత కిడ్నాప్ కథ సుఖాంతమైంది. పోలీస్ యంత్రాంగం ఛాలెంజ్‌గా ఈ కేసును తీసుకున్నది. ఏడు బృందాలు ఏర్పడి.. ఏడు రోజుల్లో కేసును ఛేదించింది. ఆ చిన్నారిని తల్లి వద్దకు చేర్చి, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నది. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చింతలపల్లికి చెందిన సింగారపు మధు-లాస్య దంపతులకు ఇద్దరు కూతుళ్లున్నారు. లాస్యకు మతిస్థిమితం కారణంతో భర్తతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నది. లాస్య తన కూతురు ఆద్విత (4)తో కలిసి వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చింది. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు మహిళలతో లాస్యకు పరిచయం ఏర్పడింది. ఐదు రోజులపాటు కలిసి రాజన్న మొక్కులు తీర్చుకున్న తర్వాత వారు లాస్యకు ఉన్న మతిస్థిమితాన్ని గమనించారు. గత డిసెంబర్ 23న చిన్నారి ఆద్వితను వారి వెంట తీసుకెళ్లారు. చిన్నారి కనిపించడం లేదని తెలుసుకున్న ఆమె మేనమామ డిసెంబర్ 30న వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీస్ యంత్రాంగం కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నది. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్‌కుమార్, ఎస్ఐలు సుధాకర్, రమేశ్, జునైద్, సిబ్బందితో ఏడు బృందాలు రంగంలోకి దిగాయి. హైదరాబాద్, కరీంగనర్, ఖమ్మం, విజయవాడ, కోదాడ, తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆధునిక సాంకేతికను వినియోగించి నిందితులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ గ్రామంలో ఉన్నట్లు గుర్తించారు. ఆ గ్రామ ఉప సర్పంచ్ సాయంతో కిడ్నాప్ కథను ఛేదించారు. ఈ క్రమంలో మహబూబాబాద్‌లోని మిలిట్రీ కాలకి చెందిన శ్రీరామోజీ వెంకటనర్సమ్మ, మల్యాలకు చెందిన కునపురి ఉప్పమ్మ, గద్వాల జోగులాంబ జిల్లా గొనుపాడుకు చెందిన గంభీరపు అంజవ్వను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. చిన్నారి ఆద్వితను సీడబ్ల్యూసీ అధికారి అంజయ్యకు అప్పగించినట్లు చెప్పారు. కిడ్నాప్ కథ సుఖాంతం చేసిన పోలీస్ బృందాన్ని ఎస్పీ అభినందించారు. పోలీసుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ, ఇతర సమాచారం, అభిప్రాయం తెలుపాలంటూ ముద్రించిన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు.

అధికలోడ్.. ఆగిన బస్సు ..

బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులో ఎక్కుతున్న ప్రయాణికులు

కోనరావుపేట, జనవరి 10: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో అధిక లోడ్ కావడంతో డ్రైవర్ బస్సును నిలిపివేసి వెళ్లాడు. సిరిసిల్ల బస్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మరిమడ్ల వెళ్లగా, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో కోనరావుపేట బస్టాండ్ వద్ద ప్రయాణికులు ఎక్కువయ్యారు. ఈ క్రమంలో ఆర్టీసీ డ్రైవర్ ఇంతమంతి ఓవర్ లోడ్‌తో బస్సు నడపలేనంటూ బస్సును దిగి వెళ్లిపోయాడు. దీంతో పలువురు గ్రామస్తులు కలుగ జేసుకుని బస్సులోని ప్రయాణికులను దింపడంతో బస్సు ముందుకు సాగింది. ఆర్టీసీ బస్సులను నరైన సమయానికి కేటాయిం చకపోవడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

మౌలిక వసతుల రూపకల్పనకు కృషి : ఎమ్మెల్యే

తెలంగాణ చౌక్, జనవరి 10: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల రూపకల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణమండపంలో బదిలీపై వెళ్లిన డీఈవో రమేశ్‌కుమార్‌కు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి హాజరై, మాట్లాడారు. విద్యా వ్యవస్థకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మేలు జరిగేలా, అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బదిలీపై వెళ్లిన డీఈవో రమేశ్‌కుమార్ మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ సంఘం కన్వీనర్ మోతిలాల్, గంగరాజు, లక్ష్మీనారాయణ, రామనాథ్, శ్రీనివాస్‌రావు తదితరలున్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం

రుద్రంగి, జనవరి 10 : వ్యవసాయ మార్కెట్ పరిధిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో పాలక వర్గం, ఎండీఏ ప్రకాశ్, కార్యదర్శి సత్యనారాయణలతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకానికి స హకరించిన ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్ 10: మండలంలోని పద్మానగర్‌లోని దేశాయి బీడీ కంపెనీలో ప్యాకింగ్ కార్మికులతో కలిసి తెలంగాణ బహుళజన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి మోర అజయ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ పరిశ్రమలోని పనిచేస్తున్న కార్మికులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ బీడీ కార్మికులకు ప్రభుత్వం అందరికీ జీవన భృతి ఇస్తామని ఓట్లు వేయించుకొని మోసం చేసిందన్నారు. ఉత్తర తెలంగాణలో దాదాపు 30 లక్షల మంది బీడీ కార్మికులు రూ. 4016 జీవన భృతి కోసం ఎదురుచూస్తున్నారని ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఉత్తర తెలంగాణ నుంచి బీడీ కార్మికులతో చలో సెక్రటేరియల్ నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. దేశాయి బీడీ ప్యాకింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఎస్‌లో మెడికల్ క్యాంపు

ఎల్లారెడ్డిపేట, జనవరి 10 : దుమాలలో ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. శుక్రవారం హాస్టల్‌లోని 133 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను అందజేశారు. 18 మందిని రక్త పరీక్షల కోసం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పంపించారు. ఇక్కడ వైద్యాధికారి సారియా అంజుమ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

నూతన నియామకం

సిరిసిల్ల టౌన్, జనవరి 10 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సిరిసిల్ల నియోజక వర్గ కన్వీనర్‌గా సిరిసిల్లకు చెందిన వెంగళ శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర కమిటీ చైర్మన్ చీమ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కనకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ

కలెక్టరేట్, జనవరి 10 : కలెక్టరేట్‌లో నేడు దివ్యాంగుల సహాయ ఉప కరణాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలతో ఆగస్టులో దివ్యాంగుల కోసం వారికి అవసరమైన సహాయ ఉపకరణాల పంపిణీ కోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆలింకో, రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో ఎంపిక శిబిరాలు నిర్వహించింది. దీనిలో భాగంగా అర్హులైన ఎంపికైన లబ్ధిదారులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం శనివారం మంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరవ్వాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మనోహర్‌రెడ్డి

రుద్రంగి, జనవరి 10 : మండల కేంద్రంలో పలువురు బాధిత కుటుంబాలను వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు శుక్రవారం పరామర్శించారు. మండలకేంద్రంలోని పాత్రికేయులు నంద్యాడపు అంజయ్య తల్లి వజ్రవ్వ ఆనారోగ్యంతో మృతి చెందగా, నాయకులతో కలిసి వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, నాయకులు గంగం మహేశ్, కంటె రెడ్డి, చెప్యాల గణేశ్, నర్సింగ్, కాదాసు లక్ష్మణ్, కోడగంటి శ్యాం, విశాల్, గణేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇసుక క్వారీని అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, జనవరి 10: మండలంలోని కనగర్తి గ్రామంలో మూలవాగులో ఇసుక క్వారీని రైతులు అడ్డుకున్నారు. మూలవాగులో నుంచి ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్లు పెద్ద ఎత్తున వచ్చి ఇసుక తరలిస్తున్నారని వారు ఆరోపించారు. ఇతర గ్రామాల ట్రాక్టర్లు నడవకూడదని, గ్రామానికి చెందిన ట్రాక్టర్లు మాత్రమే నడపాలని వారు తెలిపారు. అధికారులు అన్ని గ్రామాలకు ఇక్కడి నుంచే ఇసుక అనుమతి ఇస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు క్వారీని నడపకూడదని తెలిపారు. దీంతో అధికారులు అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు.

కనగర్తిలో అంబేద్కర్ చౌరస్తా వద్ద అడ్డుకుంటున్న రైతులు

పోలీస్‌సేవలపై అభిప్రాయం తెలుపండి : ఎస్పీ

తెలంగాణ చౌక్, జనవరి 10 : పోలీసుల పనితీరు, ప్రవర్తన, ఇతర సమాచారంపై ప్రజల అభిప్రాయాన్ని నేరుగా క్యూఆర్‌కోడ్ ద్వారా తెలుపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో క్యూఆర్‌కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. పోలీస్‌లపై ప్రజల నుంచి వారి అభిప్రాయాలను సేకరించడం కోసం క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం జరగిందన్నారు. దీని ద్వారా ఫిటీషన్, ఎఫ్ఐఆర్, ఈ-చలాన్, పాస్‌పోర్టు ధ్రువీకరణలతో పాటుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినప్పు పోలీస్ అధికారుల పనితీరు, ప్రవర్తనపై ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకొని పోలీస్‌సేవలపై సలహాలు, సూచనలివ్వాలని పేర్కొన్నారు.

రంగోత్సవ సెలబ్రేషన్స్‌లో రాంరెడ్డిపల్లె చిన్నారుల సత్తా

బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముస్తాబాద్, జనవరి 10 : రంగోత్సవ సెలబ్రేషన్స్ జాతీయస్థాయిలో పోటీల్లో మండలంలోని రాంరెడ్డిపల్లె మండల ప్రజాపరిషత్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటి బంగారు, వెండి పతకాలు పొందడంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందించారు. రామ్‌రెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రంగోత్సవ సెలబ్రేషన్స్‌లో భాగంగా జాతీయ స్థాయిలో నిర్వహించ బడ్డ పెయింటింగ్ కాంపిటేషన్లో పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు 5 బంగారు 4 వెండి 3 కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాడు శివ ప్రసాద్, డీ స్రవంతి తెలిపారు. బహుమతులు పొందడంపై పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు మండల విద్యాధికారి రాజిరెడ్డి హాజరై విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయుడు వీ శివప్రసాద్, డీ స్రవంతిని అభినందించారు.

జూనియర్ కళాశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

ముస్తాబాద్, జనవరి 10: మండల కేంద్రంలలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ప్రిన్స్‌పాల్‌గా తిరుమల్, వైస్ ప్రిన్స్‌పాల్‌గా రంజిత్‌తో పాటు 18 మంది అధ్యాపకులుగా వ్యవహరించారు. కాలేజీ ప్రిన్స్‌పాల్ విజయ రగునందన్, అధ్యాపకులు సునిత, విజయ్‌కుమార్,రాజేశ్వర్‌రావు, రాజు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అధ్యాపకురాలు

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును.
No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి

- ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి
- డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత

మాట్లాడుతున్న నాయకులు రజినీకాంత్, అరుణ్‌కుమార్

కలెక్టరేట్, జనవరి 10 : ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రాజన్నసిరిసిల్ల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా యువతకి యూత్ డిక్లరేషన్ పేరుతో 5 హామీలను ఇవ్వడం జరిగిందన్నారు. ఏటా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ద్వారా నియామకాలు చేపడతామని, నిరుద్యోగ భృతి రూ. 4 వేలు ఇస్తామని, యూత్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినదని, కానీ, ఇప్పటి వరకు యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయలేదన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించారే తప్ప దాని ప్రకారం.. అమలు చేయడం లేదు. ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు రాకుండా తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాముల రమేశ్ చంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్, కుర్ర రాకేశ్, జిల్లా సహాయ కార్యదర్శి గుండెల్లి కల్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆటవస్తువుల వితరణ

ఎల్లారెడ్డిపేట, జనవరి 10 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు ఆట వస్తువులను వితరణగా అందజేశారు. శుక్రవారం పాఠశాలకు రూ.15 వేల విలువైన ఆట వస్తువులు అందించిన సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

- జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

వేములవాడ టౌన్: ఉత్సవమూర్తులతో అంబారిసేవతో ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వేములవాడ టౌన్/సిరిసిల్ల టౌన్/కోనరావుపేట/చందుర్తి/గంభీరావుపేట/రుద్రంగి, జనవరి 10: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరారు. అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం ఉత్తర ద్వారం ద్వారా స్వామివార్లను దర్శించుకుని తన్మయత్వం చెందారు. పలు ఆలయాల్లో నిర్వహించిన వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించిన వేడుకలకు భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రాజన్న అనుబంధ దేవాలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయం, జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, చందుర్తి మండలం బండపల్లిలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, మూడపల్లిలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి, మల్యాలలో వేంకటేశ్వరస్వామి, గంభీరావుపేటలోని శ్రీ సీతారామస్వామి, రుద్రంగిలోని ప్రహ్లాద పర్వతంపై వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, ఇల్లంతకుంట, ముస్తాబాద్ మండలాల్లోని పలు ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివార్లను దర్శించుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

విద్యార్థులు తయారు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

గంభీరావుపేట, జనవరి 10 : మండలకేంద్రంలోని కేజీ టూ పీజీ సముదాయం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్‌ను విద్యార్థులు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులు ఆయా ఆహార పదార్థాలను తయారు చేసి, కళాశాలలో ప్రదర్శించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా తయారు చేసుకునే ఆహార పదార్థాల ప్రాముఖ్యతపై ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్జీపూర్ గ్రామంలో మీకోసం

ఇల్లంతకుంట, జనవరి 10 : మండలంలోని వంతడుపుల గ్రామంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు.. శుక్రవారం మీకోసం కార్యక్రమాన్ని ఎస్ఐ శ్రీకాంత్ నిర్వహించగా, రూరల్ సీఐ మొగిలి హాజరయ్యారు. సీఐ మాట్లాడుతూ, గ్రామంలో యువత గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించామన్నారు.

'చిట్టిబాబుపై చర్యలు తీసుకోవాలి'

తెలంగాణ చౌక్, జనవరి 10: ఓ న్యూస్ చానల్‌లో ఇంటర్వ్యూలో రజకులను కించపరిచేలా మాట్లాడిన రచయిత చిట్టిబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రచయిత చిట్టిబాబుపై ఫిర్యాదు చేసి, అనంతరం మాట్లాడారు. రజకుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడి నవారిపై కేసు నమోదు చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బాధ్యులు బండి మల్లేశం, సతీశ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాకారులకు అభినందనలు

విద్యార్థులను అభినందిస్తున్న జగన్మోహన్‌రెడ్డి

కోనరావుపేట, జనవరి 10 : నిజామాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనగా, మాజీ సెస్ చైర్మన్ కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. క్రీడాకారులకు తమ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు షాబుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

చందుర్తి,జనవరి10: అదనపు కట్నంకోసం భార్యను వేధించిన సంఘటనలో భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మెరుపుల మధులత ఆలియాస్ నిఖిత వివాహం మర్రిగడ్డకు చెందిన మెరుపుల వెంకటేశ్‌తో 2011లో జరిగింది. రెండేళ్ల నుంచి అదనంగా రూ. లక్ష కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడు. ఈ నెల 8న అదనంగా కట్నం తీసుకొని రావాలని ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు

ఇల్లంతకుంట : బోగి మంటలు వేస్తున్న విద్యార్థులు